ప్రజాశక్తి

సోమవారం 11 నవంబర్ 2024

5

అల్లూరి సీతారామరాజు

సర్పంచ్ చొరవతో విద్యుత్ స్తంభాలు ఏర్పాటు

ఏర్పాటు చేసిన విద్యుత్ స్తంభం

ప్రజాశక్తి -అనంతగిరి:మండలంలోని టోకురు పంచాయతీ పరిధి పింపోడువలస గ్రామంలో ఉన్న విద్యుత్ స్తంభాలను ఏర్పాటు చేశారు. ఇవి మరమ్మతు గురై కూలిపోయే ప్రమాదంలో ఉండటంతో సర్పంచ్ కిల్లో మోస్య పరిశీలించారు. స్పందించిన విద్యుత్ శాఖ అధికారులు మరమ్మతుకు గురైన స్తంభాలను తొలగించి ఆదివారం రెండు విద్యుత్ స్తంభాలు ఏర్పాటు చేశారు. విద్యుత్ శాఖ అధికారులకు సర్పంచ్ గ్రామస్తుల తరఫున ధన్యవాదాలు తెలిపారు.

సమస్యలు పరిష్కరించాలని

104 ఉద్యోగుల ఆందోళన

ర్యాలీ చేపడుతున్న 104 ఉద్యోగులు, సిఐటియు నేతలు

ప్రజాశక్తి-పాడేరు:ఆంధ్రప్రదేశ్ 104 ఎంఎంయూ ఎంప్లాయిస్ యూనియన్ రాష్ట్ర కమిటీ మేరకు సిఐటియు ఆధ్వర్యంలో ఆదివారం పాడేరులో 104 ఉద్యోగులు ర్యాలీ, ధర్నా నిర్వహించారు. 104 ఉద్యోగులంతా ఐ టి డి ఏ వద్దకు చేరుకొని ఉదయం 9 నుంచి సాయంత్రం 4 గంటల వరకు ధర్నా నిర్వహించారు. అనంతరం ఐటీడీఏ నుంచి అంబేద్కర్ సెంటర్ వరకు తమ సమస్యలు పరిష్కరించాలని డిమాండ్ చేస్తూ నినాదాలతో ర్యాలీ కొనసాగించారు. అంబేద్కర్ సెంటర్ కు చేరుకుని మానవహారం ఏర్పాటు చేసి ప్రభుత్వం తక్షణమే తమ సమస్యలపై స్పందించాలని డిమాండ్ చేశారు.

అనంతరం సిఐటియు మండల కార్యదర్శి ఎల్ సుందర్రావు అధ్యక్షతన జరిగిన సభలో 104 ఉద్యోగుల సంఘం జిల్లా అధ్యక్ష కార్యదర్శులు సిహెచ్ సూర్యనారాయణ, బి.రామ్మూర్తి నాయుడు, ఉపాధ్యక్షులు కే.పవన్ కుమార్ మాట్లాడుతూ, గత 16 ఏళ్ల నుండి వైద్యారోగ్య శాఖ ఆధ్వర్యంలో 104 ద్వారా గ్రామీణ ప్రాంత ప్రజలకు వైద్య సేవలు అందిస్తున్నామని, కోవిడ్, ప్రకృతి విపత్తు సమయాల్లోనూ తాము ప్రజలకు వైద్య సేవలు అందిస్తున్నామని తెలిపారు.సమస్యల పరిష్కారం పై తక్షణ చర్యలు తీసుకోవాలని వారు డిమాండ్ చేశారు. జీతాలు సక్రమంగా అందక అప్పులు చేసి పస్తులుండి కుటుంబాలను నెట్టుకొస్తున్నామని ఆవేదన వ్యక్తం చేశారు. అవుట్సోర్సింగ్ ఉద్యోగుల కంటే తక్కువ వేతనాలు పొందుతున్నామని నిత్యావసర ధరలు దృష్టిలో ఉంచుకొని జీవో 7 ప్రకారం తమకు వేతనాలు ఇవ్వాలని వారు ప్రభుత్వాన్ని డిమాండ్ చేశారు. సమస్యల పరిష్కరించకుంటే ఆందోళన ఉధృతం చేస్తామని వారు హెచ్చరించారు. ఈ కార్యక్రమంలో 104 ఉద్యోగుల సంఘం వర్కింగ్ ప్రెసిడెంట్ సునీల్ కుమార్, ట్రెజరర్ వరప్రసాద్, కమిటీ సభ్యులు కృష్ణవేణి, రమేష్ పాత్రో, ఫణి కుమారి, రాజ్ కిషోర్ మహేష్, నవీన్, శ్రీనివాస్, కృష్ణ తదితరులు పాల్గొన్నారు.

ప్రధాన డిమాండ్లు:

104 సర్వీసులను గతంలో మాదిరిగా పీహెచ్సీల ద్వారా నిర్వహించాలి. అరబిందో యాజమాన్యం ద్వారా తమ బకాయి వేతనాలు ఇప్పించాలి. 2020 తర్వాత విధుల్లో చేరిన డ్రైవర్ మరియు డీఈఓ లకు ఉద్యోగ భద్రత కల్పించాలి. జీవో నెంబర్ 7 ప్రకారం వేతనాలు చెల్లించాలి. మూడేళ్ల నుండి యాజమాన్యం ఇవ్వకుండా నిర్లక్ష్యం చేస్తున్న ఇంక్రిమెంట్లను ఏరియర్స్ రూపంలో ఇవ్వాలి వాహనాల ఫిట్నెస్ ఇన్సూరెన్స్ వెంటనే చేయించాలి. పిఎఫ్ మరియు ఈఎస్ఐ లను యాజమాన్యం వాటా చెల్లించే విధంగా చర్యలు తీసుకోవాలి. సుదీర్ఘకాలంగా పనిచేస్తున్న 326 మంది సీనియర్ డ్రైవర్లను ఇతర వైద్య శాఖలో కాంట్రాక్ట్ పద్ధతిలో నియమించాలి.

మాట్లాడుతున్న సర్పంచ్

ఉపాధి హామీ పనులకు ప్రణాళికలు

ప్రజాశక్తి-చింతపల్లి: ఎన్డీఏ కూటమి ప్రభుత్వం ఏర్పడిన నాటి నుండి గ్రామసభల ఆమోదంతో మొదలవుతున్న మహాత్మా గాంధీ జాతీయ గ్రామీణ ఉపాధి హామీ పథకం పనులను జాబ్ కార్డులు కలిగి ఉన్న ప్రతి ఒక్కరూ సద్వినియోగం చేసుకోవాలని బలపం సర్పంచ్ కె రమేష్ నాయుడు కోరారు. ఉపాధి హామీ పనుల గుర్తింపులో భాగంగా బలపం పంచాయతీలో ఉపాధి హామీలో పనుల గుర్తింపునకు ఏర్పాటు చేసిన గ్రామ సభకు ఆయన ముఖ్య అతిథిగా హాజరయ్యారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ, 2025 - 26 ఆర్థిక సంవత్సరానికి ఉపాధి హామీ పథకం ద్వారా చేపట్టనున్న పనులను గుర్తించి, గ్రామసభల ఆమోదంతో వాటికి సంబంధించిన ప్రణాళికలు సిద్ధం చేయడం జరుగుతుందన్నారు. ఇప్పటివరకు జరిగిన గ్రామ సభలలో ఆమోదించిన పనులను త్వరలో ప్రారంభించడం జరుగుతుందన్నారు. ఈ కార్యక్రమంలో ఉపాధి హామీ పథకం ఈసి మధుసూదన్, టెక్నికల్ అసిస్టెంట్ ప్రభాకర్, ఫీల్డ్ అసిస్టెంట్ కోటి, జి.మోహన్ పాల్గొన్నారు.

మన్యాన్ని కమ్మేసిన మంచు

ప్రజాశక్తి -పాడేరు : మన్యంలో మంచు అందాలు కనువిందు చేస్తున్నాయి. శీతాకాలం మొదలు కావడంతో గత కొన్ని రోజులుగా మన్యమంతటా దట్టంగా పొగ మంచు కురుస్తోంది. మంచు దుప్పట్లో మన్యం ఒదిగి పోతుంది. ఉదయం 9 గంటల వరకు మంచు కురుస్తుండడంతో ఎటు చూసినా మంచు కురుస్తున్న దృశ్యాలు పర్యాటకులను ఆకట్టుకుంటున్నాయి. మంచు ముసుగులో మన్యం సోయగం ద్విగుణీకృతం అవుతుంది. మంచు ముసుగులోనే ఉదయం వేళల్లో జనజీవనం సాగిపోతుంది... మన్యంలో నెమ్మది నెమ్మదిగా ఉష్ణోగ్రతల కూడా తగ్గుముఖం పడుతున్నాయి చలి తీవ్రత అధికంగా లేక పోవడంతో జనజీవనం సాధారణంగా సాగిపోతోంది. అయితే ప్రస్తుతం పొగ మంచు కురుస్తున్న సమయం ఆరంభం కావడంతో పర్యాటకుల తాకిడి పెరుగుతోంది.

మంచులో వెళుతున్న బస్

పూర్వ విద్యార్థుల ఆత్మీయ కలయిక

ప్రజాశక్తి-చింతపల్లి : పదవ తరగతిలో కలిసి చదువుకున్న పూర్వ విద్యార్థులు 37 ఏళ్ల తర్వాత ఆదివారం ఆత్మీయంగా కలుసుకున్నారు. 1987 - 88 సంవత్సరంలో తాము విద్యనభ్యసించిన స్థానిక జిల్లా పరిషత్ ఉన్నత పాఠశాలలోని నాటి తరగతి గదిలో కూర్చుని పాత జ్ఞాపకాలు నెమరు వేసుకున్నారు. ఈ సందర్భంగా నాటి జ్ఞాపకాలను గుర్తు చేసకుని స్నేహితులందరూ భావోద్వేగానికి లోనయ్యారు. అనంతరం మండల కేంద్రానికి కూతవేటు దూరంలోని స్థానిక పంచాయితీ మల్లవరం గ్రామంలో ఆట పాటలతో సందడి చేశారు, వనభోజనాలు చేశారు.

పూర్వ విద్యార్థులు

లీజు పేరుతో భూదురాక్రమణ

బాధ్యులపై చర్యలకు సున్నంపాడు, మద్దులూరు భూబాధితుల డిమాండ్

సున్నంపాడులో మాట్లాడుతున్న భూబాధితులు

ప్రజాశక్తి- మారేడుమిల్లి: : ఏజెన్సీలో భూఆక్రమణలకు పాల్పడుతున్న అక్కిస బాలు, అతని అనుచరులపై కఠిన చర్యలు తీసుకోవాలని సున్నంపాడు, మద్దూలూరు గ్రామస్తులు డిమాండ్ చేశారు. ఆదివారం మండలంలోని సున్నంపాడు గ్రామంలో భూ బాధితులు మీడియా సమావేశంలో మాట్లాడుతూ సున్నంపాడు గ్రామానికి చెందిన కంగాల వెంకటేశ్వర్లు, మారేడుమిల్లి పంచాయతీ, మద్దులూరు గ్రామానికి చెందిన కత్తుల సోమిరెడ్డి, లింగారెడ్డి లకు చెందిన భూములను అక్కిస బాలు అనే వ్యక్తి కూరగాయాలు పండిస్తానని లీజు పేరుతో అగ్రిమెంట్ రాయించుకొని, కొన్నాళ్ల తర్వాత మరో గిరిజనుల పేరిట నకిలీ భూపత్రాలు సృష్టించి ఇపడు ఆయా భూములు తమవేనంటూ ఆధిపత్యం చెలయిస్తున్నాడని బాధితులు ఆవేదన వ్యక్తం చేస్తున్నారు. ఇదేమిటని మేము ప్రశ్నిస్తే తమపై అక్రమ కేసులు బనాయిస్తు న్నాడని వాపోతున్నారు. దీనిపై పలుమార్లు అధికారులు చుట్టూ తిరిగినా తమకు న్యాయం జరగకపోగా, భూ హక్కుదారులమైన తమపైనే తిరిగి అక్రమ కేసులు బనాయించి మనోవేదనకు గురి చేస్తున్నారని బాధితులు వాపోయారు. ఇప్పటికైనా సంబంధిత అధికారులు ఈ అక్రమ వ్యవహారంపై దృష్టిసారించి తమకు న్యాయం చేయాలని వేడుకుంటున్నారు.మాజీ సర్పంచ్ పొడియం కన్నపుదొర, పొడియం శ్రీనుబాబు, కంగాల రాజేశ్వరి, శ్రీదేవి, టిఎన్ఎస్ఎఫ్ రాష్ట్ర ఫౌండర్ మరియు చైర్మన్ వలి భాస్కర్ గ్రామస్తులు పాల్గొన్నారు.

జిఒ 3 పునరుద్ధరణ కోరుతూ

నేడు జికె.వీధిలో సిపిఎం నిరసన

ప్రజాశక్తి -సీలేరు: జిఒ3 పునరుద్ధరణకు అసెంబ్లీలో తీర్మానం చేయాలని కోరుతూ ఈనెల 11న జికె వీధి మండల కేంద్రంలో సిపిఎం ఆధ్వర్యాన నిరసన చేపట్టనున్నట్లు సిపిఎం గాలికొండ ఎంపిటిసి అంపరంగి బుజ్జిబాబు కోరారు. ఈ ఆందోళన విజయవంతానికి పెద్దఎత్తున గిరిజనులు, యువత తరలిరావాలని పిలుపునిచ్చారు.

ఆదివారం స్థానిక విలేకరులతో మాట్లాడుతూ అసెంబ్లీ సమావేశాలు జరుగుతున్న తరుణంలో జిఒ3 పునరుద్ధరణకు చట్టబద్ధత కల్పించాలని నిరసన వ్యక్తం చేయాలని నిర్ణయించామన్నారు. ప్రస్తుత ముఖ్యమంత్రి చంద్రబాబు విపక్షనేతగా ఉన్నప్పుడు అరుకు బహిరంగసభలో గిరిజనులకు ఇచ్చిన హామీని నెరవేర్చాలని కోరారు. డిఎస్సి నియామకాలు చేపట్టకముందే జిఒ 3 చట్టబద్ధతపై తగు చర్యలు చేపట్టాలని డిమాండ్ చేశారు. టెట్ పాసైన గిరిజన యువత త్వరలో నిర్వహించబోయే మెగా డిఎస్సిలో ఉద్యోగాల సాధన కష్టతరమని, గిరిజనులకు ప్రత్యేక డిఎస్సి ప్రకటిస్తేనే న్యాయం జరుగుతుందని బుజ్జిబాబు అన్నారు. పిల్లల భవిష్యత్తు కోసం యువతతోపాటు తల్లిదండ్రులు కూడా నిరసనలో పెద్దసంఖ్యలో పాల్గొని జయప్రదం చేయాలని కోరారు.

మృతుని కుటుంబానికి ఆర్థిక సాయం

ప్రజాశక్తి-కూనవరం : మండలంలోని పోలిపాక గ్రామంలో అనారోగ్యంతో మృతి చెందిన బుయ్యన వెంకటాద్రి కుటుంబాన్ని తెలుగుదేశం పార్టీ నాయకులు, జెకెసి ట్రస్ట్ చైర్మన్ డాక్టర్ జమాల్ఖాన్ పరామర్శించి ప్రగాఢ సానుభూతి తెలిపారు. బాధిత కుటుంబానికి రూ.ఐదువేల ఆర్థిక సాయం అందించారు.కార్యక్రమంలో టిడిపి అరకు పార్లమెంటరీ అధికార ప్రతినిధి ఎడవల్లి భాస్కరరావు, కూనవరం మండల ప్రధానకార్యదర్శి, మాజీ ఎంపిపి పొడియం అప్పారావు, పార్టీ మాజీ మండల అధ్యక్షులు గడేసుల ప్రేమ్చంద్, చెలికాని ఉమామహేశ్వరరావు, భాస్కరరావు, వీరమల్ల సునీల్, నీరుడు లక్ష్మీనారాయణ, మడకం చిన్ని, షేక్ రసూల్, పార్టీ కార్యకర్తలు పాల్గొన్నారు.

చాపరాయి వద్ద పర్యాటకులు

చాపరాయి కిటకిట

ప్రజాశక్తి-డుంబ్రిగుడ:కార్తీక మాసం ప్రారంభం కావడంతో మండలంలోని పర్యాటక కేంద్రమైన చాపరాయి జలపాతంలో ఆదివారం అధిక సంఖ్యలో పర్యాటకులు తరలివచ్చారు. దీంతో, చాపరాయి జలపాతం పర్యాటకులతో కిటకిటలాడింది. ఇక్కడ సందర్శించిన పర్యాటకులు జలపాతంలో స్నానాలు ఆచరిస్తూ ఆనందంగా గడిపారు. గార్డెన్లో ఫోటోలు తీయించుకుంటూ పర్యాటకులు ఆనందంగా గడిపారు. జలపాతం నుంచి అరకు వరకు నిన్న చెట్టు నీడల్లో వనభోజనాలు చేసి ఆటపాటలతో సందడి చేశారు.

నిలిచిపోయిన కల్వర్టు పనులు

నిలిచిన రోడ్డు, కల్వర్టుల పనులు

ప్రజాశక్తి అనంతగిరి: రోడ్డు పనులు ప్రారంభించి ఏళ్ల గడుస్తున్నప్పటికీ పూర్తి చేయకపోవడంతో వరదలకు కోతకు గురై రాకపోకలకు ప్రయాణికులు తీవ్ర ఇబ్బందులకు గురవుతున్నారు. అనంతగిరి మండలం మారుమూల కివర్ల పంచాయతీ పరిధి బల్లగరు మెయిన్ రోడ్డు నుండి మద్రెబు సుమారు ఎనిమిది గ్రామాలకు 2011-12 సంవత్సరంలో రోడ్డు పనుల్లో భాగంగా కంకర మెటల్ వేసి రోలింగ్ చేపట్టకుండా వదిలి వేశారు. ఈ రింగ్ రోడ్డు భారీ వర్షాల కారణంగా కోతకు గురై రాళ్ళు తేలడమే కాకుండా మర్గంలో ఏర్పాటు చేసిన కలర్టులు పూర్తిగా దెబ్బతింది. దీంతో రాకపోకలు పూర్తిగా స్దంబించాయి. బైక్లు, అంబులెన్స్ల రాకపోకలు నిలిచి పోవడంతో రోగులు కిలోమీటర్ల దూరం కాలినడకన వెళ్లవలసిన పరిస్థితి ఏర్పడుతుంది. బలగరువు, వాజంగి, దయార్తి, కరకవలస, గుర్రాల బంద గ్రామాల గిరిజన ప్రజలు కిలోమీటర్ల దూరం రోగులను డోలీ సహాయంతో కాలినడకన బలగరు మెయిన్ రోడ్డుకు తరలిస్తున్నారు. ఇప్పటికైనా ప్రభుత్వం తక్షణం స్పందించి ఏళ్ల తరబడి నిలిచిన రోడ్డు పనులు చేపట్టాలని ఆయా గ్రామల గిరిజనులు కోరుతున్నారు.

నిరుపయోగంగా ఉన్న మెటల్

కాఫీ, జీడిమామిడి రైతులకు

దళారుల నుంచి విముక్తి కల్పించండి

- సిపిఎం జిల్లా కార్యదర్శివర్గ సభ్యులు చిన్నయ్యపడాల్
- ఉత్సాహంగా పార్టీ కొయ్యూరు మండల మహాసభ

సీతారాం ఏచూరికి నివాళులర్పిస్తున్న సిపిఎం నేతలు, కార్యకర్తలు

ప్రజాశక్తి -కొయ్యూరు : . జీడి, కాఫీ రైతులకు దళారీ వ్యవస్థ నుంచి విముక్తి కల్పించాలని సిపిఎం జిల్లా కార్యదర్శి వర్గ సభ్యులు బోనంగి చిన్నయ్య పడాల్ డిమాండ్ చేశారు. ఆదివారం పార్టీ మండల కమిటీ సభ్యుడు గెమ్మెలి సాన అధ్యక్షతన జరిగిన ఏడవ మండల మహా సభలో దీనిపై ప్రభుత్వం, జిల్లా కలెక్టర్కు తక్షణ చర్యలు చేపట్టేలా విన్నవించాలని తీర్మానించారు.

మహాసభలో ముందుగా సిపిఎం అఖిల భారత కార్యదర్శి సీతారం ఏచూరి చిత్రపటానికి పూలమాలలు వేసి నివాళులర్పించారు. అనంతరం జరిగిన సభలో సిపిఎం జిల్లా కార్యదర్శి వర్గ సభ్యులు బోనంగి చిన్నయ్య పడాల్ మాట్లాడుతూ- ప్రభుత్వాల విధానాల వల్ల, గిరిజన ప్రాంతంలో పండిస్తున్న జీడి మామిడి, కాఫీ రైతులకు గిట్టుబాటు ధరల దక్కక దళారీ వ్యవస్థ నుంచి తీవ్ర నష్టం కలుగుతోందన్నారు. అయినా ప్రభుత్వాలు పట్టించుకోవడంలేదని మండిపడ్డారు. మండలంలో 40 వేల కుటుంబాలు జీడి మామిడి తోటలపై ఆధారపడి బతుకుతున్నారన్నారు, అలాగే ముంచంగిపుట్టులో 4వేలు, అనంతగిరిలో ఐదు వేల కుటుంబాలు జీడి మామిడి రైతులు ఉన్నారన్నారు. ఏడాది పొడుగునా ఇంటిల్లిపాది కష్టించి పండించిన పంట దళారుల చేతుల్లోకి వెళ్ళిపోతుందని ఆవేదన వ్యక్తం చేశారు. ఇదే కాకుండా మిగతా మండలాలలో కాఫీ రైతులు రెండు లక్షలకు పైగా ఎకరాల్లో సాగు చేస్తున్నారని గుర్తు చేశారు, జీడిమామిడి, కాఫీ రైతుల ఆదాయం మీద దళారుల కన్ను పడిందని, అయితే అధికారులు, ప్రభుత్వం పట్టించుకోలేదని మండిపడ్డారు. పదివేల మంది కాఫీ రైతులకు ఇవ్వాల్సిన ప్రోత్సాహక నిధులు రూ.5 కోట్లు ఐటిడిఎ అధికారులు పక్కన పెట్టారన్నారు. జీడిమామిడి, కాఫీ రైతులకు గిట్టుబాటు ధర కల్పించాలని, దళారీ వ్యవస్థ నుండి కాపాడాలని, లేదంటే గిరిజన రైతులను కదిలించి ఛలో కలెక్టరేట్ ఆందోళన చేపడతామని హెచ్చరించారు.

సిపిఎం మండల కార్యదర్శిగా సూరిబాబు



సిపిఎం మండల కమిటీ ఎన్నికలో మండల కార్యదర్శిగా మరోసారి ఎస్. సూరిబాబును ఏకగ్రీవంగా మండల మహాసభ ఎన్నుకుంది. కార్యక్రమంలో సిపిఎం మండల నాయకులు, సాన, పి.ప్రసాద్, చిట్టిబాబు, శంకరరావు, టి. చిట్టిబాబు, జె.పెంటయ్య పాల్గొన్నారు. అంతకుముందు మూడేళ్ల నివేదికను కార్యదర్శి సూరిబాబు మండల మహాసభలో ప్రవేశపెట్టారు.

తీగలమెట్టకు రోడ్డు నిర్మించరూ..!

- నిధులు మంజూరైనా ప్రారంభం కాని పనులు
- ఆవేదన చెందుతున్న తీగలమెట్ట గిరిజనులు

నిరసన వ్యక్తం చేస్తున్న తీగలమెట్ట గ్రామస్తులు

ప్రజాశక్తి- కొయ్యూరు : మండలంలోని తీగల మెట్ట గ్రామానికి రహదారి సౌకర్యం కల్పించాలని స్థానిక గిరిజనులు కోరుతున్నారు.'మ గ్రామానికి రోడ్డు లేదని పలుమార్లు ఉన్నతాధికారులకు, ప్రజా ప్రతినిధులకు విన్నవించిన నేపథ్యంలో, ఇటీవల తమ గ్రామ రహదారి నిర్మాణానికి జిల్లా కలెక్టర్ రూ.40 లక్షల నిధులు మంజూరు చేశారన్నారు. నిధులు మంజూరు చేసినట్లు ప్రకటించి, నెలన్నర రోజులు గడుస్తున్నా, నేటికీ రోడ్డు పని ప్రారంభించలేదని వాపోతున్నారు. దీనిపై సంబంధితకాంట్రాక్టర్, అధికారులను అడిగితే రేపు మాపు అంటూ వాయిదాలు వేస్తున్నారని ఆవేదన వ్యక్తం చేస్తున్నారు స్థానిక మండల ఇంజనీరింగ్ అధికారులు స్పందించి తమ గ్రామానికి రోడ్డు నిర్మాణ పనులు ప్రారంభమయ్యేలా చర్యలు తీసుకోవాలని తీగల మెట్ట గ్రామ గిరిజనులు ప్రాధేయ పడుతున్నారు.

ఉల్లాసంగా పాపికొండల విహారయాత్ర

- శని, ఆదివారాల్లో గోదావరి తీరంలో పర్యాటక సందడి
- 14 బోట్లులో తరలిన 720 మంది సందర్శకులు
- మధురానుభూతి మిగిలుస్తోందని పర్యాటకుల హర్షం

ప్రజాశక్తి- దేవీపట్నం: పాపికొండలు పర్యాటక ప్రాంతం సందర్శకులతో కళకళలాడింది. శని, ఆదివారాలు గోదావరి నదిలో పర్యాటక బోట్లు సందడి చేశాయి రెండు రోజుల్లో విహారయాత్రకు భారీగా పర్యాటకులు వెళ్లారు.. దేవీపట్నం మండలం నుంచి పాపికొండల విహారయాత్రకు ప్రతిరోజు పర్యాటక బోట్లు వెళుతున్నాయి. శని ఆదివారాల్లో మాత్రం పర్యాటకుల సంఖ్య చాలా ఎక్కువగా ఉంది. శనివారం ఏడు పర్యాటక బోట్లలో 320 మంది పర్యాటకులు వెళ్ళగా, ఆదివారం 7 పర్యాటక బోట్లలో 400 మంది పర్యాటకులు గోదావరి నదిలో పాపికొండలు విహారయాత్రకు వెళ్లారు. ఈ రెండు రోజులు బోట్ల యజమానులకు, టూరిజం శాఖకు ఆదాయాన్ని తీసుకొస్తున్నాయి. ఉదయం 9 గంటలకు బయలుదేరిన పర్యాటక బోట్లు, గోదావరి నది చుట్టుపక్కల ఉన్న ప్రకృతి అందాలను తిలకించే అవకాశాన్ని సందర్శకులకు కల్పిస్తూమధ్యాహ్నం సమయానికి పాపికొండలకు చేరుకుంటారు. అక్కడ పేరంటాలపల్లి వద్ద శివాలయాన్ని దర్శించుకుని, పర్యాటక ప్రాంతాలను తిలకించి తిరిగి ప్రయాణం అవుతారు. సాయంత్రం ఐదు గంటలకు ప్రసిద్ధ పుణ్యక్షేత్రం గండి పోచమ్మ తల్లి ఆలయం వద్ద ఉన్న బోట్ పాయింట్ వద్దకు చేరుకుంటారు. విహారయాత్రకి వెళ్లే పర్యాటకులు అందరికీ అవసరమైన సౌకర్యాలు ఏర్పాటు చేస్తున్నామని, ప్రతి ఒక్కరికీ లైఫ్ జాకెట్లు ఇస్తున్నామని టూరిజం శాఖ అధికారులు తెలిపారు. పర్యాటకులందరూ లైఫ్ జాకెట్లు వేసుకోవడం, ఇతర అన్ని జాగ్రత్తలు తీసుకున్న తర్వాతే బోట్లు గోదావరి నదిలో ప్రయాణిస్తున్నాయని తెలిపారు. కాగా విహారయాత్రకు వెళ్లిన పర్యాటకులు అందరూ సంతోషాన్ని వ్యక్తం చేశారు..ఇక్కడ ప్రదేశాలు అద్భుతంగా ఉన్నాయని అంటున్నారు.



సందర్శకులతో పాపికొండల విహారయాత్రకు గోదావరిలో వెళ్తున్న బోటు

అటవీ అమర వీరులకు ఘన నివాళి

నివాళులర్పిస్తున్న రేంజర్, సిబ్బంది

ప్రజాశక్తి-డుంబ్రిగుడ: విధి నిర్వహణలో అమరులైన అటవీ శాఖ అమరులకు స్థానిక అటవీ శాఖ రేంజ్ అధికారి పి.శ్రీనివాసరావు ఆధ్వర్యంలో ఆదివారం ఘనంగా నివాళులు అర్పించారు. ఈ సందర్భంగా వారి చిత్రపటానికి పూలమాలలు వేసి నివాళులర్పించారు. అనంతరం ఆయన మాట్లాడుతూ, అమరవీరులను వారి త్యాగాలను స్ఫూర్తిగా తీసుకొని విధి నిర్వహణను సక్రమంగా నిర్వర్తించి వృత్తి పట్ల నిబద్ధతతో మెలగాలని తెలిపారు. ఈ కార్యక్రమంలో ఫారెస్ట్ రేంజ్ ఆఫీసర్ పి. శ్రీనివాసరావు, అటవీ సిబ్బంది పాల్గొన్నారు.

ఉపకార వేతనాలకు దరఖాస్తుల స్వీకరణ

ప్రజాశక్తి -పాడేరు: ఏజెన్సీలోని కాఫీ తోటల రైతు కూలీల పిల్లల విద్యాభ్యాసంకు కాఫీ బోర్డ్ అందిస్తున్న ఉపకార వేతనాలు పొందడానికి ఈ నెల 30 వరకు దరఖాస్తులు చేసుకోవడానికి గడువు ఉందని కేంద్ర కాఫీ బోర్డు సభ్యులు కురుసా ఉమామహేశ్వరరావు ఒక ప్రకటనలో తెలిపారు. ఇంటర్ /పాలిటెక్నిక్ /ఐటిఐ చదువుతున్న వారికి రూ. 5000, డిగ్రీ వారికి రూ. 7,500, పీజీ వారికి రూ. 15,000 ఆపై కోర్సుల వారికి రూ. 20,000 లను ఉపకార వేతనం గా కాఫీ బోర్డు ద్వారా ఇస్తుందని ఆయన తెలిపారు. గత సంవత్సరం సెమిస్టర్‌లో ఎస్సీ, ఎస్టీ వారు 50శాతం, ఇతరులు 60శాతం దాటి మార్కులు పొంది ఉండాలని చెప్పారు. కేంద్ర కాఫీ బోర్డ్ కార్యాలయంలో పూర్తి వివరాలను తెలుసుకొని అర్హులైన అభ్యర్థులు దరఖాస్తు చేసుకోవాలని సూచించారు.

సభ్యత్వ నమోదు చేయిస్తున్న నాయకులు

టిడిపి సభ్యత్వ నమోదు

ప్రజాశక్తి-చింతపల్లి:పాడేరు నియోజకవర్గంలో తెలుగుదేశం పార్టీని మరింత బలోపేతం చేసే దిశగా సభ్యత్వ నమోదు ప్రక్రియ కొనసాగిస్తున్నామని ఆ పార్టీ మండల అధ్యక్షుడు కిలో పూర్ణచంద్రరావు అన్నారు. కొత్తపాలెం పంచాయతీ పెదపాకలు, మూలగొంది, మామిడిపల్లి గ్రామాల్లో సభ్యత్వ నమోదు కార్యక్రమం నిర్వహించారు. మండలంలోని అన్ని పంచాయతీల్లో ఈ ప్రక్రియను వేగవంతం చేయాలని నాయకులు, కార్యకర్తలకు సూచించారు. అనంతరం కొత్తపాలెంలో వంద మీటర్ల సిమెంట్ రహదారి నిర్మాణానికి శంకుస్థాపన చేశారు. ఈ కార్యక్రమంలో తెదేపా నాయకులు మహేంద్ర, సుకుదేవ్, సత్తిబాబు తదితరులు పాల్గొన్నారు.

అగ్ని ప్రమాద బాధితురాలికి సాయం

ప్రజాశక్తి-వేపగుంట : జివిఎంసి 94వ వార్డు పరిధి బంటకాకాలనీలోని ఓ ఇంటిలో గ్యాస్ లీకైన ప్రమాదంలో తీవ్రంగా గాయపడ్డ మీసాల పైడమ్మ కుటుంబానికి పెందుర్తి ఎమ్మెల్యే పంచకర్ల రమేష్‌బాబు సహాయం అందించారు. వార్డు పర్యటనలో ఉన్నందుని పార్టీ ద్వారా విషయం తెలుసుకొని బాధితురాలిని ఎమ్మెల్యే పరామర్శించారు. రూ.10 వేలు ఆర్థిక సహాయంతోపాటు మూడు నెలలకు సరిపడా రేషన్ సరుకులను అందించారు. ప్రభుత్వం నుంచి కూడా తగిన సహకారం అందేలా చూస్తానని హామీ ఇచ్చారు. ఈ కార్యక్రమంలో వార్డు కార్పొరేటర్ బల్ల శ్రీనివాసరావు, కూటమి నాయకులు, కార్యకర్తలు పాల్గొన్నారు.

పొంచివున్న ప్రమాదం

- రోడ్డుకు ఆనుకుని విద్యుత్ ట్రాన్స్‌ఫార్మర్లు
- ఏర్పాటుచేయని రక్షణ కంచె
- ఆందోళనలో స్థానికులు

రిసార్ట్ వద్ద ఉన్న విద్యుత్ ట్రాన్స్ ఫార్మర్లు

ప్రజాశక్తి-అరకులోయ:అరకులోయ ప్రాంతాల్లో రోడ్డుకి ఆనుకొని ట్రాన్స్‌ఫార్మర్లు ఏర్పాటు చేయడంతో వాహన చోదకులు తీవ్ర భయాందోళనకు గురవుతున్నారు. మండలంలోని పెద్దలబుడు పంచాయితీ పాలిరంగిని మొదలుకొని అరకు లోయ వరకు రిసార్ట్ల యజమానులు విద్యుత్ ట్రాన్స్ ఫార్మర్లు రిసార్ట్ స్థలాల్లో ఏర్పాటు చేయకుండా, అరకు విశాఖ ప్రధాన రహదారికి ఆనుకొని ఏర్పాటు చేశారు.ఐటిఐ దగ్గరలోని యాపిల్ రిసార్ట్స్, మౌంటెన్ రిసార్ట్స్, అల్లూరి రిసార్ట్స్ నిర్వాహకులు సమీపంలోనే ట్రాన్స్ఫార్మర్లు ఏర్పాటు చేశారు.విద్యుత్ ట్రాన్స్ఫార్మర్లు రోడ్డుకు ఆనుకొని ఉండటంతో వాహనాలు ఆపడానికి కూడా వీలులేని పరిస్థితి నెల కొంది. దీనికి తోడు ట్రాన్స్ ఫార్మర్‌కు రక్షణ కంచి కూడా వేయకపోవడంతో ప్రమాదాలు జరిగే అవకాశాలు ఉన్నాయని వాహన చోదకులు తెలిపారు. ట్రాన్స్‌ఫార్మర్‌కు రక్షణ కంచె లేక పోవడంతో ఇటీవల అనేక పశువులు కూడా మృతి చెందిన విషయం తెలిసిందే. ఇటువంటి పరిస్థితులు పునరావృతం కాకుండా రోడ్డుకు ఆనుకొని ఉన్న ట్రాన్స్ఫార్మర్లను తొలగించాలని గిరిజనులు కోరుతున్నారు.

తాగునీటి బోర్ల మరమ్మతు పనులు

ప్రజాశక్తి - చింతపల్లి:రెండు తాగునీటి బోర్‌లకు మరమ్మత్తు నిర్వహించి వినియోగంలోకి తీసుకు రావడం జరిగిందని ఎర్రబొమ్మల ఎంపీటీసీ సభ్యుడు సెగ్గె సత్తిబాబు అన్నారు. ఆదివారం ఆయన మాట్లాడుతూ, కొండవంచల గ్రామంలో తాగునీరు అందించే రెండు బోర్లు మరమ్మత్తుకు గురై గడచిన ఐదు నెలలుగా నీటి కోసం గ్రామస్తులు తీవ్ర ఇబ్బందులు ఎదుర్కొన్నారన్నారు. అధికారులతో మాట్లాడి ఎట్టకేలకు బోర్లను మరమ్మత్తులు నిర్వహించి వినియోగంలోకి తీసుకురావడం జరిగిందన్నారు. ఈ కార్యక్రమంలో మాజీ ఎంపీటీసీ సభ్యుడు బేరా సత్యనారాయణ, పి చిన్నబ్బాయి కొండవంచల గ్రామస్తులు పాల్గొన్నారు.

బోరు మరమ్మతు పనులు చేయిస్తున్న ఎంపిటిసి

ముఖ్యమంత్రికి దొన్నుదొర కృతజ్ఞతలు

మాట్లాడుతున్న దొన్నుదొర

ప్రజాశక్తి -అరకులోయ రూరల్: రాష్ట్ర ప్రభుత్వం విజయనగరం ఆర్టీసీ రీజనల్ బోర్డు ఛైర్మన్‌గా సివేరి దొన్నుదొరను నియమించింది. ఈ సందర్భంగా ఆయన ఆదివారం స్థానిక విలేకరులతో మాట్లాడుతూ, తనపై నమ్మకం ఉంచి ఏపిఎస్ ఆర్టీసీ విజయనగరం రీజినల్ బోర్డు చైర్మన్ పదవి బాధ్యతలు అప్పగించిన ముఖ్యమంత్రి చంద్రబాబు, ఉప ముఖ్యమంత్రి పవన్ కళ్యాణ్, నారా లోకేష్‌లకు ప్రత్యేక ధన్యవాదాలు తెలిపారు. తనకు ఇచ్చిన బాధ్యతలు సక్రమంగా నిర్వహిస్తానని తెలిపారు. తనను గతంలో టీడీపి రాష్ట్ర ఎస్టీ సెల్ అధ్యక్షుడుగా, అరకు నియోజక వర్గ ఇన్చార్జిగా బాధ్యత అప్పగించారని మళ్ళీ ఇచ్చిన మాట ప్రకారం ఏపీ ఆర్టీసీ విజయనగరం రీజినల్ బోర్డు చైర్మన్ పదవి బాధ్యతలు అప్పగించారని తెలిపారు. మారుమూల ప్రాంతాలకు బస్సు సౌకర్యం కల్పించే విధంగా చూస్తామన్నారు. ప్రయాణికులకు సురక్షితమైన మెరుగైన ప్రయాణాన్ని అందించడానికి తన వంతు కృషి చేస్తానని ఆయన చెప్పారు. ఏపిఆర్టీసీ అభివృద్ధికి కృషి చేస్తానన్నారు.

దొన్నుదొరకు అభినందనలు

హుకుంపేట: ఆర్‌టిసి రీజనల్ చైర్మన్‌గా దొన్ను దొర నియమితులు కావడంతో టిడిపి నాయకులు హర్షం వ్యక్తం చేశారు. తెలుగుదేశం నాయకులు శతక బొంజుబాబు, మాజీ సర్పంచ్ శంకర్ నాయుడు, అరకు అసెంబ్లీ ఎస్టీ సెల్ అధికార ప్రతినిధి కొర్రా సంతోష్ కుమార్, ఎస్టీ సెల్ ఆర్గనైజింగ్ సెక్రెటరీ, యువ నాయకులు కూడేలి నూకరాజు, సుమన, కొర్రా నూకరాజు దొన్నుదొరను సన్మానించి అభినందనలు తెలియజేశారు.

నేరాలు ఘోరాలు

బోల్తా పడిన వాహనం

స్కార్పియో బోల్తా : తప్పిన పెను ప్రమాదం

ప్రజాశక్తి -అనంతగిరి:రోడ్డు పనులు పరిశీలించి తిరుగు ప్రయాణంలో వెళుతుండగా స్కార్పియో వాహనం బోల్తా పడిన ఘటనలో కాంట్రాక్టర్ పెను ప్రమాదం తప్పింది. అనంతగిరి పంచాయతీ పరిది రాజుపాక నుండి డెక్కపురం, హుకుంపేట మండలం పట్యాదౌడ గ్రామాలకు రోడ్డు పనులు జరుగుతున్నాయి. ఈ రోడ్డు పనులను కాంట్రాక్టర్. సత్తిబాబు సత్యనారాయణ .పనులు పరిశీలించి వెళుతుండగా రాజుపాక గ్రామం సమీపం వద్ద వాహనం అదుపు తప్పి బోల్తా పడింది.ఈ ప్రమాదంలో కాంట్రాక్టర్ స్వల్ప గాయాలతో బయట పడ్డాడు. రాజుపాక గ్రామస్తులు హుటాహుటిన చేరుకుని వాహనంలో ఇరుకున్న సత్తిబాబును బయటకు తీసి 108 అంబులెన్స్‌లో అనంతగిరి ఆసుపత్రికి తరలించి వైద్య సేవలు అందించారు.

పెట్రోల్ బంక్ పక్కన మృతదేహం

ప్రజాశక్తి - యలమంచిలి : మండలంలోని పోతిరెడ్డి పాలెం వద్ద పెట్రోలు బంకు పక్కన ఆదివారం ఉదయం మృతదేహం పడివుంది. దాని పక్కనే నిర్మాణంలో ఉన్న దక్కన్ సిమ్మెంట్ కంపెనీ సెక్యూరిటీ గార్డు ఆ శవాన్ని గమనించి పోతిరెడ్డి పాలెం విఆర్‌ఓకు సమాచారం అందించారు. వీఆర్ఓ నేరస్థలాన్ని పరిశీలించి, కుళ్లిపోయిన స్థితిలో ఉన్న మృతుని జేబులో దొరికిన ఆధారాలు పరిశీలించారు. మృతుడు తెలంగాణ రాష్ట్రం, యాదాద్రి భువనగిరి జిల్లా , భువనగిరి మండలం, బస్వాపురం వాసి పాముల చందు (36)గా గుర్తించారు. విఆర్ఓ ఇచ్చిన ఫిర్యాదు మేరకు యలమంచిలి రూరల్ పోలీసులు కేసు నమోదు చేశారు. క్లూస్ వచ్చి పరిశీలించింది. మృతదేహాన్ని మార్చురీకి తరలించారు. మరణానికి కారణం, చనిపోయి ఎంతకాలం అయిందీ తెలియాల్సి ఉందని పోలీసులు తెలిపారు.

పనులు ప్రారంభిస్తున్న సర్పంచ్ శారద

జల్ జీవన్ పనులకు శంకుస్థాపన

ప్రజాశక్తి-డుంబ్రిగుడ:జల్ జీవన్ మిషన్ పథకంతో ప్రతి ఇంటికి సురక్షితమైన తాగు నీరు కల్పించడం జరుగుతుందని అరుకు పంచాయతీ సర్పంచ్ జీ శారద చెప్పారు. ఆ పంచాయతీ నేరేడువలస గ్రామంలో జల్ జీవన్ మిషన్ పథకం ద్వారా గ్రావిటీ పథకం మంజూరు కావడంతో ఆదివారం ఆమె శంకుస్థాపన చేసి పనులను ప్రారంభించారు. అనంతరం ఆమె మాట్లాడుతూ, ఈ పథకం ద్వారా ఆ గ్రామంలోని సుమారు 100 గృహాలకు నీటి సమస్య తీరుతుందని చెప్పారు. ఈ కార్యక్రమంలో ఆర్ డబ్ల్యూ ఎస్ శాఖ ఏఈఈ మహేష్, అధికారులు తదితరులు పాల్గొన్నారు.

మాట్లాడుతున్న జోగారావు

జిఒ 3 ప్రయోజనాలతో ఏజెన్సీ ఉద్యోగ నియామక చట్టం చేయాలి

ప్రజాశక్తి - కూనవరం : జిఒ 3 ప్రయోజనాలతోఏజెన్సీలో నిరుద్యోగులకు శతశాతం ఉద్యోగ నియామకాలు జరిగేలా ప్రత్యేక చట్టం చేయాలని ఆదివాసీ మెడికల్ హెల్త్ ఎంప్లాయిస్ అసోసియేషన్ రాష్ట్ర అధ్యక్షులు జోగారావు డిమాండ్ చేశారు. ఆదివారం మండలంలోని కోతుల గుట్ట గ్రామంలో కౌళూరి మోజేశ్ అధ్వర్యంలో ఆదివాసీ నిరుద్యోగుల సమావేశంలో జోగారావు మాట్లాడుతూ, జిఒ 3ను పునరుద్ధరించి, చట్టబద్ధత కల్పిస్తామని ముఖ్యమంత్రి చంద్రబాబు ఇచ్చిన హామీ అమలులో కాలయాపన జరుగుతున్న నేపథ్యంలో, చూస్తూ కూర్చుంటే ప్రయోజనముండదన్నారు. ప్రస్తుతం అసెంబ్లీ సమావేశాలు ప్రారంభం కానున్న నేపథ్యంలో షెడ్యూల్డ్ ప్రాంత ఉద్యోగ నియామక చట్టం తేవాలని. లేకుంటే గిరిజన ఎమ్మెల్యేలు, ఇతర ప్రజాప్రతినిధులను గ్రామాల్లో తిరగనివ్వబోమని ఒత్తిడి చేయాలన్నారు. మాట్లాడాలని అన్నారు లేదంటే ఏజెన్సీ లో ఎంఎల్ఏ లు తిరిగే పరిస్థితి ఉండదని హెచ్చరించారు. రాజకీయ నాయకులు,ఉద్యోగులు ముందుకు వచ్చి ఈ ఉద్యమానికి మద్దతుగా నిలవాలని పిలుపు ఇచ్చారు, కార్యక్రమంలో పరిషత్ జిల్లా అధ్యక్షులు సోడి ముత్తయ్య, ఆదివాసి మెడికల్ అండ్ హెల్త్ ఎంప్లాయిస్ అసోసియేషన్ మండల అధ్యక్షులు తాటి రామకృష్ణ, పి అశోక్,పి వసంత్,కె ముత్యాల రెడ్డి, ఎస్. నాగరాజు, ఎస్.జీవన్, కె.హరీష్ పాల్గొన్నారు.

జిఒ 3 పునరుద్ధరణ హామీని నెరవేర్చాలి

ప్రజాశక్తి - దేవీపట్నం : జిఒ 3 పునరుద్ధరణ, చట్టబద్ధతకు ముఖ్యమంత్రి చంద్రబాబు ఇచ్చిన హామీని వెంటనే నిలబెట్టుకోవాలని ఆదివాసీ జెఎసి వైస్ చైర్మన్ తెల్లం శేఖర్ అన్నారు. ఆదివారం దేవీపట్నం మండలం కొత్తవీధి గిరిజన సంక్షేమ ఆశ్రమ పాఠశాలలో విద్యార్థులతో సమావేశంలో మాట్లాడుతూ, జిఒ 3 ప్రయోజనాలను పునరుద్ధరించిన తర్వాతే ఏజెన్సీలోని శతశాతం ఉద్యోగాలు గిరిజనులకు వర్తించేలా రిజర్వేషన్లు కల్పించి భర్తీ చేయాలని కోరారు. ట్రైబల్ అడ్వైజర్ కౌన్సిల్ (టిఎసి) తక్షణమే స్పందించి పార్లమెంట్‌లో షెడ్యూల్డ్ ప్రాంత ఉద్యోగాల నియామకాల చట్టం తక్షణమే ప్రకటించాలని డిమాండ్ చేశారు.కార్యక్రమంలో ఆదివాసీ జెఎసి మండల కార్యదర్శి యలగాడ నాగేశ్వరరావు, రాష్ట్ర కార్యదర్శి కారం రామన్న దొర, బొరగ నాగరాజు, విద్యార్థులు పాల్గొన్నారు.

పాముకాటుతో అస్వస్థత

ప్రజాశక్తి - సీలేరు: జీకే వీధి మండలం ఎ.దారకొండ పంచాయతీ గొల్లపల్లి గ్రామానికి చెందిన చిలకల జాన్ ఆదివారం ఉదయం కాఫీ తోటలో పాము కాటుకు గురై అస్వస్థత పాలయ్యాడు. కాఫీతోటలో కాపు లేని చెట్లు కొమ్మలను తొలగిస్తుండగా పాము కాటేసింది. వెంటనే ఆర్‌వి.నగర్ ప్రభుత్వాసుపత్రికి అంబులెన్స్ సహాయంతో తరలించారు.క్కడ ప్రాథమిక చికిత్స అనంతరం చింతపల్లి ప్రభుత్వ ఆసుపత్రికి తరలించారు. మెరుగైన వైద్యసేవల కోసం నర్సీపట్నం ఏరియా ఆసుపత్రికి తరలించగా, వైద్యసేవలు అందించారు. ఆరోగ్య పరిస్థితి నిలకడగా ఉన్నప్పటికీ, విశాఖ కెజిహెచ్‌కు తరలించారు. ప్రస్తుతం చిలకల జాన్ ఆరోగ్యపరిస్థితి నిలకడగా ఉందని గాలికొండ ఎంపిటిసి అంపరంగి బుజ్జిబాబు తెలిపారు.

12న మహారాణిపేట నాక్ సెంటర్‌లో జాబ్ మేళా

ప్రజాశక్తి - ఎంవిపి.కాలనీ : మహారాణిపేటలో ఈ నెల 12న మంగళవారం నైపుణ్య అభివృద్ధి శిక్షణ శాఖ ఆధ్వర్యంలో నాక్ సెంటర్‌లో జాబ్ మేళా నిర్వహిస్తున్నామని జిల్లా నైపుణ్యాభివృద్ధి అధికారి టి.చాముండేశ్వరరావు తెలిపారు. ఈ జాబ్ మేళాలో వీల్స్‌మార్ట్, నిధి ఫైనాన్షియల్ సర్వీసెస్, పే టీమ్ కంపెనీలు పాల్గొంటాయని తెలియజేశారు.

మిగిలింది ముగ్గురే..!

పైలా, గవిరెడ్డి, బుద్ధకు లేని నామినేటెడ్ పదవి
బిజెపి, జనసేనల్లో అసంతృప్తి
ప్రాధాన్యత ఇవ్వలేదని గుర్రు

ప్రజాశక్తి - అనకాపల్లి ప్రతినిధి


నాగ జగదీష్

గవిరెడ్డి రామానాయుడు

పైలా ప్రసాదరావు

జిల్లాలో ముగ్గురు టిడిపి నాయకులకు నామినేటెడ్ పదవుల్లో స్థానం లభించలేదు. సాధారణ ఎన్నికల్లో అభ్యర్థుల విజయానికి పనిచేసిన వారికి తగిన గౌరవం కల్పిస్తామని చెప్పిన టిడిపి అధినేత చంద్రబాబు నాయుడు ఆ హామీ కంటే స్థానిక రాజకీయ పరిస్థితుల ఆధారంగా నామినేటెడ్ పదవుల్లో ప్రాధాన్యత ఇచ్చినట్లు కనబడుతోంది. మొదటి, రెండు దశల నియామకాల్లో విధేయతకు అవకాశం కల్పించారని భావించినా మాజీ ఎమ్మెల్సీ బుద్ధ నాగజగదీశ్వరరావుకు పదవి ఇవ్వకపోవడంతో ఆ విధేయత ఒక్కటే చూడలేదని అర్థమవుతోంది. నామినేటెడ్ పదవులు రాక లోలోపల నాయకుల్లో వ్యక్తమవుతున్న అసంతృప్తులను గుర్తించి సామాజిక తరగతులను పరిగణనలోకి తీసుకొని ఈసారి ముగ్గురికి ప్రాధాన్యత ఇచ్చినట్లు కనబడుతోంది. గత ఎన్నికల్లో టిక్కెట్ కోల్పోయిన మాజీ ఎమ్మెల్యే పీలా గోవింద సత్యనారాయణ, బత్తుల తాతయ్య బాబులకు మొదటసారి నామినేటెడ్ ప్రక్రియలో చైర్మన్ పదవులు ఇచ్చారు. రెండో దఫా కూడా గత ఎన్నికల్లో ఎమ్మెల్యే టికెట్‌రాని యలమంచిలి నియోజకవర్గ టిడిపి ఇన్‌ఛార్జ్ ప్రగఢ నాగేశ్వరరావును రాష్ట్ర రోడ్లు డెవలప్‌మెంట్ కార్పొరేషన్ ఛైర్మన్‌గా, మాడుగుల నియోజకవర్గ ఇన్‌ఛార్జ్ పివిజి.కుమార్‌ను కొప్పల వెలమ కార్పొరేషన్ ఛైర్మన్‌గా చంద్రబాబు నియమించారు. అనకాపల్లికి చెందిన మళ్ల సురేంద్రకు గవర సంక్షేమ అభివృద్ధి కార్పొరేషన్ ఛైర్మన్ పదవి అప్పగించారు.

అయితే... మాడుగుల నియోజకవర్గ టిడిపి అభ్యర్థిగా పోటీ చేయించి, వెనక్కు తగ్గించిన పైలా ప్రసాదరావుకు ఈసారీ నామినేటెడ్ పోస్టుల్లో చోటు దక్కలేదు. పార్టీ అభ్యర్థిగా నామినేషన్ వేయడానికి సమాయత్తమవుతున్న సమయంలో పైలాను తప్పించి పెందుర్తి టిక్కెట్ రాని బండారు సత్య నారాయణమూర్తిని మాడుగుల నుంచి పోటీ చేయించారు. తనను అవమానపర్చారని కొన్ని రోజులు అసంతృప్తి వ్యక్తంచేసినా, చివరకు బండారు విజయానికి పైలా పనిచేశారు. కానీ రెండుసార్లు ప్రకటించిన నామినేటెడ్ పదవుల నియామకంలో పైలాను పక్కన పెట్టారు. చంద్రబాబు హామీతో పోటీచేయని మాజీ ఎమ్మెల్యే గవిరెడ్డి రామానాయుడుకు ఈసారీ నామినేటెడ్ గౌరవం ఇవ్వలేదు. చంద్రబాబుకు అత్యంత విధేయునిగా వున్న మాజీ ఎమ్మెల్సీ బుద్ధ నాగజగదీశ్వరరావుకు నామినేటెడ్ పదవి ఇవ్వకపోవడంతో అవమానపర్చినట్లుగా ఆయన అనుచరులు భావిస్తున్నారు. ఎమ్మెల్సీ పదవి ఆశించిన పీలా గోవింద సత్యనారాయణకు నామినేటెడ్ పదవితో సరిపెట్టి, బుద్ధకు ఎమ్మెల్సీ పదవి ఇవ్వాలన్న యోచనతో నామినేటెడ్ పదవిని చంద్రబాబు ఇవ్వలేదన్న ప్రచారం జరుగుతోంది.

ఇదిలావుంటే రెండోసారి పదవుల్లో కూటమి ప్రభుత్వం ధర్మం తప్పిందని బిజెపి, జనసేన నాయకత్వం గుర్రుమంటోంది. ప్రస్తుతానికి బయటపడనప్పటికీ, రెండోసారి కేటాయించిన మూడు ఛైర్మన్ పదవులూ టిడిపి నాయకత్వానికి ఇవ్వడంపై అక్కడక్కడా వారిలో అసంతృప్తులు వ్యక్తమవుతున్నాయి. జనసేన ఎమ్మెల్యేలు పట్టుపట్టకపోవడంతో నామినేటెడ్ పదవులు తమకు రాలేదన్న అసంతృప్తి ఆ నియోజకవర్గ జనసేన నాయకుల్లో వుంది. ఎంపీ సిఎం రమేష్ టిడిపి నాయకత్వానికి ఇచ్చిన ప్రాధాన్యత బిజెపికి ఇవ్వకపోవడంతో తమకు పదవులు రాలేదన్న విమర్శ ఆ పార్టీ నాయకత్వంలో వినబడుతోంది.

జివిఎంసి నీటి సరఫరా విభాగం ఎస్ఇ అక్రమాలను అరికట్టాలి

ప్రజాశక్తి - విశాఖ కలెక్టరేట్ : జివిఎంసి నీటి సరఫరా విభాగంలో ఎస్ఇగా పనిచేస్తున్న కెవిఆర్.రవి అవినీతి, అక్రమాలను అరికట్టాలని జివిఎంసి వాటర్ ఫిల్టరేషన్ ప్లాంట్ వర్కర్స్ యూనియన్ (సిఐటియు) అధ్యక్షులు పి.వెంకటరెడ్డి డిమాండ్ చేశారు. ఆదివారం జగదాంబ దరి సిఐటియు కార్యాలయంలో ఏర్పాటు చేసిన మీడియా సమావేశంలో ఆయన మాట్లాడుతూ ఎస్ఇ రవి ఆనంద్ యూనియన్ నాయకులతో కుమ్మక్కై అడ్డగోలుగా ఉద్యోగ నియామకాలు చేస్తున్నారన్నారు. ఆయన విషయమై ఇప్పటికే జివిఎంసి కమిషనర్‌కు ఫిర్యాదు చేశామన్నారు. తక్షణం విజిలెన్స్ విచారణ జరిపించాలని కోరారు. విధుల నుంచి తొలగించాలని డిమాండ్ చేశారు. నీటి సరఫరా విభాగంలో పనిచేస్తున్న 900 మంది కార్మికులకు రవి అన్యాయం చేస్తున్నారన్నారు. ఈ విభాగంలో మరణించడం, ఉద్యోగ విరమణ చేయడం ద్వారా ఖాళీ అయితే ఆ పోస్టులను అమ్ముకుంటున్నారని విమర్శించారు. ఆయనపై చర్యలు తీసుకోని పక్షంలో తమ పోరాటాన్ని మరింత ఉధృతం చేస్తామని హెచ్చరించారు. సమావేశంలో యూనియన్ ప్రధాన కార్యదర్శి బి.ఆనంద్ కుమార్, ఉపాధ్యక్షులు కె.వెంకట్రావు, సహాయ కార్యదర్శి సిహెచ్.రాజు, రమణ పాల్గొన్నారు.

చిన్నారుల కంటి సమస్యలపై వాక్‌థాన్

ప్రజాశక్తి - ఎంవిపి.కాలనీ : చిన్నపిల్లల్లో వచ్చే కంటి వ్యాధుల పట్ల సామాజిక అవగాహన పెంచే క్రమంలో డాక్టర్ ఎల్‌వి.ప్రసాద్ నేత్ర వైద్య విజ్ఞాన సంస్థ ఆధ్వర్యాన 'బాల్య శుక్లం' పేరుతో ఆదివారం ఉదయం బీచ్ రోడ్‌లో వాక్‌థాన్ నిర్వహించారు. కన్సల్టెంట్ పీడియాట్రిక్ ఆప్తమాలజిస్ట్ డాక్టర్ అబిప్సా శర్మ ఈ సందర్భంగా మాట్లాడుతూ చిన్నపిల్లలలో కంటి వ్యాధి లక్షణాలను త్వరగా గుర్తించడం, పిల్లలు స్పష్టంగా చూడగలిగేటట్టు త్వరగా చర్యలు చేపట్టడం తల్లిదండ్రులు చేయాలన్నారు.

ఎస్‌సి మహిళలకు రుణాలు

ప్రజాశక్తి - ఎంవిపి కాలనీ : ప్రధానమంత్రి అనుసూచిత్ జాతి అభ్యుదయ పథకం ద్వారా సెర్ప్, డిఆర్‌డిఎ ఆధ్వర్యంలో ఎస్‌సి కార్పొరేషన్ నుంచి ఎస్‌సి మహిళలకు రాయితీ రుణాలను అందిస్తున్నట్టు ఎస్‌సి కార్పొరేషన్ కార్యనిర్వాహక సంచాలకులు ఎం.సత్యపద్మ, డిఆర్‌డిఎ పీడీ తెలిపారు. ఈ మేరకు వారు ఓ ప్రకటన విడుదల చేశారు. ఈ పథకం ద్వారా రూ.50 వేలు సబ్సిడీతో కనిష్ట పరిమితి లక్ష నుండి గరిష్ట పరిమితి 3 లక్షలు వరకు రుణాలు ఇవ్వనున్నట్టు పేర్కొన్నారు. 18-60 సంవత్సరాల వయసు కలిగి డ్వాక్రా సంఘంలో సభ్యురాలైన ఎస్‌సి మహిళలు అర్హులని పేర్కొన్నారు.

రోగులను పరీక్షిస్తున్న వైద్యులు

400 మందికి ఉచిత వైద్యసేవలు

ప్రజాశక్తి - రంపచోడవరం : రాజమండ్రి రామకృష్ణ మిషన్ గిరిజన సంచార వైద్యశాల అధ్వర్యంలో ఆదివారం నిర్వహించిన ఉచిత వైద్యశిబిరంలో 400మందికి వైద్య సేవలు అందించినట్లు మిషన్ కార్యదర్శి స్వామి పరిజ్ఞేయనందజీ మహారాజ్ తెలిపారు. వైద్యశిబిరంలో డాక్టర్లు టివి.సుబ్బారావు, రాయుడు శ్రీనివాస్, దాసరి ఉమామహేష్, ఎస్.సంపత్‌కుమార్ పాల్గొని రోగులను పరీక్షించారు. ఈ సందర్భంగా 68మందికి రక్తపరీక్షలు, 15మందికి థైరాయిడ్, ఐదుగురికి ఇసిజిలు, 15మందికి ఫిజియోథెరపీ స్వామీజీ తెలిపారు.

వేమగిరి, పరమహంస యోగానంద నేత్రాలయం ఆధ్వర్యంలో కంటి వైద్యశిబిరం నిర్వహించి 87మందికి కంటి పరీక్షలు చేశారు. దృష్టిలోపం ఉన్న 22మందికి కళ్లజోళ్లు అందించారు. అంతరకుసుమాలున్న 10మందిని కంటి ఆపరేషన్స్‌కు ఎంపికచేసి, వేమగిరిలోని పరమహంస యోగానంద నేత్రాలయానికి తరలించినట్టు స్వామీజి తెలిపారు. జిబిఆర్ ఫౌండేషన్ ద్వారా డాక్టర్ గోపాలం, శివన్నారాయణ, సిబ్బంది పాల్గొని 76మందికి మూర్చవ్యాధి నిర్ధారణ పరీక్షలు నిర్వహించారు. మూర్చవ్యాధి తీసుకోవాల్సిన జాగ్రత్తలపై అవగాహన కల్పించారు. కార్యక్రమంలో కె.మాలతీ దేవి, సలీం ఖాన్ పాల్గొన్నారు.

ఈ సందర్భంగా స్వామీజీ మాట్లాడుతూ, రామకృష్ణ మిషన్ ఉచితంగా అందిస్తున్న వైద్యసేవలను సద్వినియోగం చేసుకోవాలని కోరారు. వైద్య శిబిరంలో క్యాంప్ కోఆర్డినేటరు కానుమోను శ్రీనివాస్, పరమహంస యోగానంద నేత్రాలయం ప్రోగ్రాం మేనేజర్ నక్కా చంటిబాబు, వాలంటీర్స్ దాసరి పెద్ద అప్పారావు, సూర్య వర్మ సంజీవ్ పాల్గొన్నారు. శిబిరంలో పాల్గొన్న రోగులకు,వారి సహాయకులకు భోజన సదుపాయం సమకూర్చారు.

ఇసుక సేకరణలో జాగ్రత్తలు పాటించాలి

ప్రజాశక్తి- రంపచోడవరం : రంపచోడవరం సబ్‌డివిజన్ పరిధిలో నదులు, కాలువలు, వాగుల నుంచి ఇసుక సేకరించిన వారు నిబంధనల మేరకు తగు జాగ్రత్తలు తీసుకోవాలని రంపచోడవరం డిఎస్‌పి సాయి ప్రశాంత్ కోరారు. అడ్డతీగల మండలం, తిమ్మాపురం పంచాయతీ బొంగరాలపాడు గ్రామం వద్ద ఏలేరు కాలువలో ఇసుక సేకరించుటకు వెళ్లి నలుగురు వ్యక్తులు కాలువ నీటిలో మునిగి చనిపోయిన నేపథ్యంలో ఇసుక తెచ్చుకునేందుకు వెళ్లిన ప్రతిఒక్కరూ తగుజాగ్రత్తలు తీసుకోవాలని, తద్వారా ప్రమాదాల బారిన పడి ప్రాణాలు కోల్పోకుండా ఉండొచ్చని సూచించారు. రాష్ట్ర ప్రభుత్వం నిర్దేశించిన ప్రదేశంలో మాత్రమే ఇసుక తవ్వకాలు చేపట్టాలని, ఈత రాని వారు కాలువలు, వాగులు, నదుల్లోకి ఇసుక సేకరణకు దిగరాదని, అలాగే చీకటి పడ్డాక ఎట్టి పరిస్థితుల్లోనూ నదుల్లోకి ,వాగుల్లోకి, నది పాయల్లోకి ఇసుక కోసం దిగరాదన్నారు. ఇసుక సేకరణకు కాలువలు నదుల్లోకి దిగే ముందు అక్కడి భౌతిక పరిస్థితులపై అవగాహన కలిగి, తాడు సాయంతో ముందుగా దిగి, పరిస్థితిపై అంచనాకు వచ్చిన తర్వాతే ఇసుక సేకరణ చేపట్టాలన్నారు. గుంతలు, ఊబిలు, ఇతర ప్రమాదకర ప్రదేశాల్లో ఎట్టిపరిస్థితుల్లోనూ ఇసుకకు దిగరాదన్నారు.

నారీశక్తి బ్రాంచి ప్రారంభం

ప్రజాశక్తి - ఎంవిపి.కాలనీ : యూనియన్ బ్యాంకు అఫ్ ఇండియా ఆధ్వర్యంలో విశాఖలోని సీతమ్మధారలో నారీ శక్తి బ్రాంచిని వర్చువల్ విధానంలో కేంద్ర ఆర్థిక శాఖా మంత్రి నిర్మలా సీతారామన్ ప్రారంభించారు. స్థానికంగా జరిగిన కార్యక్రమంలో బ్యాంక్ ఎగ్జిక్యూటివ్ డైరెక్టర్ ఎస్.రామ్ సుబ్రహ్మణ్యన్, జోనల్ హెడ్ శాలిని మీనన్, రీజనల్ హెడ్ ఆర్.నరసింహ కుమార్, బ్రాంచి మేనేజర్ ఎం.ముకుంద ప్రియ తదితరులు పాల్గొని జ్యోతి ప్రజ్వలన చేశారు.